అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 10 ఏప్రిల్ 2023

రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-బిచ్కుంద

డిఎస్‌పి జగన్నాథ్ రెడ్డి, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిఎస్పి పవన్ కుమార్ ఆధ్వర్యంలో బిచ్కుంద మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి కమ్మరి గుడి వరకు వాజిద్ నగర్ గ్రామంలోని ప్రధాన వీధిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ముందు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాచనీయాల సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు అదుపులో తీసుకువచ్చేందుకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు 60 మంది సిబ్బంది తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు డిఎస్పి జగన్నాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణ, బిచ్కుంద, మద్నూర్ ఎస్సైలు శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


రిలే దీక్షలో నాయకులు, రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తమ భూములకు హద్దులు చూపాలని కోరుతూ నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నెమ్లికి చెందిన రైతు కుటుంబాలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 14 రోజులకు చేరుకున్నాయి. ఇని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు కానీ, నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని సీపీఐ(ఎం) నాయకులు రవీందర్ అన్నారు. ఈ నెల 4వ తేదీనా భూమి సర్వే చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చినా ఇప్పటి వరకు చేపట్టలేదని తెలిపారు. భూ సమస్య పరిష్కారం అయ్యే వరకు భూమి కోసం పోరాటం సాగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

దాతృత్వం.. సరోజనమ్మ

- రూ. 20 లక్షలతో ధర్మ స్థలం భవన నిర్మాణం
- సొంత ఇల్లు పెన్షనర్స్ అసోసియేషన్‌కు అప్పగింత
- పేదలకు వైద్యం కోసం పెన్షన్ సొమ్ము వినియోగం

నవతెలంగాణ-బోధన్

ఓ రిటైర్డ్ టీచర్.. అనేక సేవ కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే సొంత ఇంటిని సైతం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు అందజేయగా.. తన పెన్షన్ సొమ్మును సైతం సేవా కార్యక్రమాలకు, నిరుపేదల వైద్యం కోసం వెచ్చిస్తున్నారు. తాజాగా రూ.20 లక్షలతో ధర్మస్థల భవనం నిర్మించారు. నేడు ప్రారంభించనున్న నేపథ్యంలో బోధన్ పట్టణానికి చెందిన 84 ఏండ్ల పై బడిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు గుర్రాల సరోజనమ్మ దాతృత్వాన్ని ప్రశంసించని వారు లేరంటే అతిశయోక్తి కాదు.


సరోజనమ్మ నిర్మించిన ధర్మస్థలం

బోధన్ పట్టణానికి చెందిన 84 ఏళ్లకు పైబడిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ సేవలు మరువలేనివని పలువురు కొనియాడుతున్నారు. ఆమె చేస్తున్న సేవలు అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని జనం కొనియాడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్నా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సొంత ఇంటిని పెన్షనర్స్ అసోసియేషన్‌కు ఇవ్వడమే కాకుండా, పెన్షన్‌గా వచ్చే డబ్బులను సైతం నిరుపేదల కోసం ఖర్చు చేస్తున్నారు. అంతే కాకుండా అంత్యక్రియల కోసం పేదల ఇబ్బందులను చూసి బోధన్ పట్టణ శివారులోని చెక్కి చెరువు పరిసర ప్రాంతంలో సొంత డబ్బులు రూ. 20 లక్షల వ్యయంతో ధర్మస్థల భవన నిర్మాణం చేపట్టారు. అలాగే వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న వారికి తనవంతు సహాయంగా పేదల వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు.

నేడు ధర్మస్థల భవనం ప్రారంభం..

కుల మతాలకు అతీతంగా చివరి ఘడియలో అంత్యక్రియలు జరపడానికి చెక్కితలాబ్ సమీపంలో 20 లక్షలతో నిర్మించిన ధర్మస్థల భవనం నేడు (సోమవారం 10వ తేదీన) ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేశారు. నిరుపేదలు, నిరాశ్రయుల కుటుంబ సభ్యుడి అంతిమ సంస్కారాలు వారి సంప్రదాయాల మేరకు నిర్వహించుకునేందుకు ఈ ధర్మస్థల భవనంలో ఉచిత సౌకర్యం కల్పిస్తారు. ఇందులో ఫ్రీజర్, కరెంట్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. మరుగుదొడ్డి, స్నానానికి గదులు నిర్మించారు.

నిరుపేదల ఇబ్బందులు చూసి చలించి

నిరుపేదలు చనిపోయినప్పుడు వారు పడుతున్న బాధలు ఇబ్బందులను చూసి ఆమె మనస్సు చలించిపోయింది. దాంతో ఆమె తన ఉద్యోగ విరమణ 1996లో అయిన తర్వాత నిరుపేదలకు తన వంతు సేవ చేయాలని లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాలకు పూనుకున్నారు. పొట్ట కూటి కోసం వందలాది నిరుపేద కుటుంబాలు పట్టణానికి వలస వచ్చి అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ సభ్యుడు మరణిస్తే అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు ఎక్కువ శాతం ఇంటి యాజమానులు అనుమతి ఇవ్వడం లేదు. దాంతో కుటుంబ బాధ వర్ణనాతీతం. ఇలాంటి విషాదకర పరిస్థితుల్లో ఆ కుటుంబ సభ్యులు పడే మానసిక క్షోభను ప్రత్యక్షంగా చూసిన సరోజనమ్మ మనస్సు కలిచివేసింది. ఇందుకు పరిష్కారం చూపేందుకు ధర్మ స్థలం భవన నిర్మాణం చేపట్టారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్ దాము ఆమెను ప్రోత్సహించి అండగా నిలిచారు.

ఆమె భర్త వెంకట్రావ్ 2013లో మృతి చెందారు. వీరికి సంతానం లేదు. స్థానిక గోశాల రోడ్డులో 180 గజాల విస్తీర్ణంలో గల రూ. కోటికి పైగా విలువ చేసే సొంత ఇంటిని తెలంగాణ పెన్షనర్స్ అండ్ రి టైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు సామాజిక సేవల కోసం దానం చేశారు. ప్రతి నెల వచ్చే పింఛన్ డబ్బులను ఆమె కొంత అవసరాలకు ఉంచుకుని, మిగిలిన సొమ్మును నిరుపేదల వైద్య చికిత్సల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇలా అనేక స్వచ్ఛంద సేవలు కొనసాగిస్తున్నారు.

సరోజనమ్మను సన్మానించిన గవర్నర్



విశ్రాంత ఉపాధ్యాయురాలు సరోజనమ్మ చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించిన గవర్నర్ తమిళి సై అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు సరోజనమ్మను రాజ్ భవన్ లో ఘనంగా సన్మానించారు. తన సేవలను గుర్తించి రాజ్ భవన్ లో తనను సన్మానించిన సందర్భం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని సరోజమ్మ పేర్కొన్నారు తాను నిరంతరం నిరుపేదల సేవల కోసమే పని చేస్తానని మరోమారు ప్రకటించారు.


నవతెలంగాణ విలేకరి ఎట్టెం అనిల్‌కు బహిరంగ క్షమాపణలు చెబుతున్న పలువురు గ్రామస్తులు

తప్పయింది.. క్షమించండి

- నవతెలంగాణ విలేకరికి గుమ్మిర్యాల్ వాసుల బహిరంగ క్షమాపణ

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ వీడీసీపై మూడేండ్ల క్రితం వార్త రాసినందుకు కక్ష కట్టుకున్న పలువురు.. నవతెలంగాణ మండల విలేకరి ఎట్టెం అనిల్‌పై వారం రోజుల క్రితం దాడి చేసిన విషయం విధితమే. దీంతో విలేకరి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. దాడి ఘటన పట్ల మండలంలో చర్చనీయాంశం కాగా.. దాడి చేసిన వారిపై సొంత గ్రామంలో సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఆదివారం విలేకరి ఎట్టెం అనిల్‌కు గ్రామంలో అందరి సమక్షంలో బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని, కలసిమెలసి ఉందామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

భావోద్వేగాల 'బలగం'

నవతెలంగాణ-సదాశవనగర్/ఎడపల్లి

మండలంలోని ధర్మారావుపేట్, మొడేగాం గ్రామాల్లో శనివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. దీంతో పెద్దసంఖ్యలో గ్రామస్తులు హాజరై సినిమాను తిలకించారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపెద్ద తరలివచ్చారు. సినిమాను తమ జీవితాలకు అన్వయించుకుంటూ భావోద్వేగాలకు గురై కంటతడి పెట్టుకున్నారు.

ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి బలగం చిత్రం ప్రదర్శించారు.


మంగళ్‌పాడ్‌లో చిత్రం తిలకిస్తున్న గ్రామస్తులు

ఐక్యంగా ముందుకు..

- ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు నిర్మిస్తాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు
- సీపీఐ(ఎం), సీపీఐ ఉమ్మడి సమ్మేళనానికి తరలిన నాయకులు


నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలను నిర్మిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. హైదరాబాదులో నిర్వహించిన సీపీఐ(ఎం), సీపీఐల ఉమ్మడి సమ్మేళనానికి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ ముఖ్య నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని కమ్యూనిస్టుల ఐక్యత బలపడాలని నినాదాలు చేశారు. అనంతరం రమేశ్‌బాబు మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాల ద్వారా రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించటానికి ఐక్య కార్యాచరణను రూపొందించడంలో భాగంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మొట్టమొదటిసారి సమావేశం ఐక్యంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలకు నాయకులకు అవగాహన కల్పించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి సిపిఎం అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి పోలీస్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సిపిఐ అఖిల భారత కార్యదర్శి టి రాజా, ఆల్ ఇండియా నాయకులు కే నారాయణ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తదితరులు హాజరై నాయకులకు కార్యకర్తలకు దశ దిశను నిర్దేశించినట్టు తెలిపారు. జిల్లాలో కూడా ఉద్యమాన్ని నిర్మిస్తామని తద్వారా జిల్లాలో బీజేపీని ఓడించటానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇండ్ల స్థలాలు పోడు భూముల సమస్య పరిష్కారం, కనీస వేతనాలు అమలు కోసం పోరాడి సాధించుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు, నూర్జహాన్, సబ్బని లతా, గోవర్ధన్ జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్, నన్నే సాబ్, పి సూరి , విగ్నేష్ మండల నాయకులు శ్రీనివాస్, గంగాధర్, రాములు, ఇతరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగల అలజడి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రెండు గుడిలలో హుండీలను పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటుచేసు కుంది. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న అయ్యప్ప ఆలయంవద్ద పూజారి శ్రీనివాస్ ఉదయం పూజలు చేయడానికి వెళ్లగా ప్రధాన ద్వారం ముందు ఉన్న తాళం దొంగలు పగలగొట్టి హుండీలో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారని పూజారి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శికి తెలవడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదేవిధంగా పక్కనే ఉన్న నీలకంఠేశ్వర ఆలయంలో ఉన్న హుండీ తాళం పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి సంగప్ప తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించినట్లు ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ తెలిపారు.

కేసీఆర్ సారూ.. పెన్షన్ ఇప్పించండి

వివరాలు మెయిన్‌లో..

పోస్టుకార్డులు పంపిన బీడీ కార్మికులు

నవతెలంగాణ-తాడ్వాయి

తమకు జీవన భృతి (పెన్షన్) రావడం లేదని, వెంటనే అందజేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు బీడీ కార్మికులు పోస్టుకార్డులు పంపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామంలో వార్డు మెంబర్ తిరుపత్తిరెడ్డితో కలిసి పలువురు బీడీ కార్మికులు సీఎం కేసీఆర్‌కు పోస్టాఫీస్ నుంచి లేఖలను పంపారు.


పోస్టుకార్డు చూపుతున్న వార్డు మెంబర్, బీడీ కార్మికులు

ప్లాస్టిక్ నిషేధంపై పట్టింపేది..?



- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్లాస్టిక్ వినియోగం మానవాళి జీవనశైలిలో రోజురోజుకు విచ్చలవిడిగా పెరిగిపోతున్నది. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజల నిర్లక్ష్యం పర్యావరణానికి ముప్పు తీసుకొస్తున్నది. గత సంవత్సరం జూలై నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా విక్రయాలు వినియోగం జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జులై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించడం, నిల్వ చేయడం, పంపిణీ, వినియోగాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 120 మైక్రోన్లకంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు నిషేధం పరిధిలోకి వస్తాయన కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్లాస్టిక్ వినియోగం ప్రజల జీవనశైలీలో భాగమైంది. ప్రతి పనికి, ప్రతి పనిలో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. ప్రజలు ప్రతి అవసరానికి ప్లాస్టిక్ వినియోగానికి అలవాటు పడి శుభకార్యాలతో పాటు ఏ కార్యక్రమానికైనా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్యాకింగ్ కవర్లు, రోడ్లపైన పారవేయడం మురికినీటి కాలువల్లో పేరుకుపోయి ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యం పెరుగుతోంది. దీనికి తోడు ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ రోడ్ల పైన ప్లాస్టిక్ కవర్లు పారవేయడంతో ప్లాస్టిక్ కవర్లను మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి.

ప్లాస్టిక్ కవర్లు తిని చనిపోతున్న మూగజీవాలు..



ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు ఎక్కడపడితే అక్కడ పారవేయడం ప్రజల తప్పిదాల వల్ల నోరులేని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. పచ్చని పచ్చిక బయళ్ల తినాల్సిన ఆవులు చెత్త కుప్పలలో ప్లాస్టిక్ కవర్లలో నింపి పారపోసిన పాచిపోయిన ఆహారం, కుళ్లిపోయిన పళ్లతోపాటు ప్లాస్టిక్ సంచులను కూడా మూగజీవాలు తినేస్తుండడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల పొట్టలో గుట్టలా పేరుకుపోయి అనారోగ్యానికి గురై మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కొన్ని రోజుల క్రితం బిచ్కుంద మండల కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని చనిపోయిన ఆవులను పశువుల వైద్యులు పరిశీలించగా వాటి పొట్టలో నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడ్డాయి.

తూతూ మంత్రంగా అధికారుల దాడులు

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై నిఘా ఉంచేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగం, నిల్వ ప్రదేశాలు, విక్రయ దుకాణాలు, దిగుమతులు, పంపిణీ పై దృష్టి పెడితే వినియోగం తగ్గించే అవకాశం ఉంది. ఎక్కడ ప్లాస్టిక్ వినియోగించినా తక్షణమే జరిమానాలు విధించే విధంగా ప్లాస్టిక్ ఉత్పత్తి యూనిట్లు విక్రయిదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధించే విధంగా చర్యలు చేపడితే తప్పనిసరిగా మార్పు వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు. అధికారులు మాత్రం నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ ఏదో ఒక దుకాణ యజమానికి నామ మాత్రపు జరిమానా విధించి తాము పనిచేస్తున్నామనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి

కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం విధించిన మొదట్లో అధికారులు పట్టణ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రధాన వీధులలో హెూటల్లు, దుకాణ సముదాయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడరాదని బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. పర్యావరణ కాలుష్యం నివారించేందుకు పట్టణ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎప్పటికప్పుడు చైతన్యపరిచి ప్లాస్టిక్ వినియోగం మానవాళికి ఎంత ప్రమాదకరమో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు నిషేధిత ప్లాస్టిక్ తయారీదారులు, అమ్ముతున్న వారిపై అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి.

తీవ్ర దుష్ఫలితాలు



హాజీ బాల్రాజ్. బిచ్కుంద

వాడిన ప్లాస్టిక్ సంచులను ఎక్కడపడితే అక్కడ పాడవేయడంతో మూగజీవాలు తిని చనిపోతున్నాయి. గత సంవత్సరం క్రితం ప్లాస్టిక్ నిషేధం పైన హడావుడి చేసిన అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసి భూమి సామర్థ్యం తగ్గి పండే పంటలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

ఎండకు విలవిల

- బస్సు షెల్టర్ లేక ప్రయాణీకులకు ఇక్కట్లు

నవతెలంగాణ-సదాశవనగర్


బస్సు కోసం పద్మాజివాడి చౌరస్తా వద్ద ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో బస్సు షెల్టర్ లేక ప్రయాణీకులు ఎండకు విలవిలలాడుతున్నారు. ఈ చౌరస్తా నుండి నిత్యం వేలాది మంది ప్రయాణీకులు నిజామాబాద్ ఆర్మూర్ నిర్మల్‌తో పాటు కామారెడ్డి, హైదరాబాద్, బాన్సువాడ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతలకు ప్రయాణిస్తుంటారు. ఇక్కడ రెండు బస్సుషెల్టర్‌లు ఏర్పాటు చేసినా కానీ నిరుపయోగంగా మారాయి. బస్సు షెల్టర్ వద్ద బస్సులు ఆపకుండా చౌరస్తా మీద ఆపుతుండటంతో అక్కడే ప్రయాణీకులు వేచి చూస్తున్నారు. ప్రస్తుతం ఎండ వేడితాళలేక హోటళ్లను, షాపులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులు సైతం కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి వృథా.. అరికట్టకుంటే వృథే

అసలే ఎండాకాలం, బుక్కెడు నీటి కోసం, పక్షులు, జంతువులతోపాటు మానవజాతి అల్లాడే సమయమిది. భూగర్భ జలాలు అడగంటిపోయి బుక్కెడు నీరు కోసం గ్రామాల్లో అనేక కష్టాలు పడుతుంటారు. రామారెడ్డి మండలంలోని ఇస్సన్నపల్లిలో గ్రామపంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన బోరు మోటర్, ప్రజల నీటి వసతులను తీరుస్తోంది. కానీ నీటిని అందిస్తున్న బోరు మోటారును స్టార్ట్ చేసి అలాగే వదిలేయడంతో నీరు వృథాగా పోతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

-జూపల్లి తిరుపతి. నవతెలంగాణ, రామారెడ్డి.


వృథాగా పోతున్న నీరు

కుల సంఘాల అభివృద్ధికి నిర్విరామ కృషి

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కుల సంఘాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు.. ఆదివారం పట్టణంలోని పెర్కిట్ ఆరవ వార్డులో ఎస్సీ మాల సంఘం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, పూజ నరేందర్, ఆరవ వార్డు కౌన్సిలర్ పొద్దుటూరి మురళీధర్ రెడ్డి, శాల ప్రసాద్, ఈటేడి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త న్యూ కలెక్టరేట్ రోడ్డులో నిర్మిస్తున్న ఐటీ హబ్ పనులను ఆదివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు తెలియజేశారు. అనంతరం దుబ్బాలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులని పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు.



కేసీఆర్ సాయం అందని కుటుంబం లేదు

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్ కుటుంబంపై కక్షగట్టిన మోడీ
- మూడోసారి కేసీఆర్ గెలుపును ఎవరు ఆపలేరు
- అర్హత ఉన్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సాయం అందని కుటుంబం లేదని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని కోన సముందర్ గ్రామంలోని శివ గార్డెన్‌లో నిర్వహించిన కమ్మర్ పల్లి క్లస్టర్-2 పరిధిలోని కోనాపూర్, అమీర్‌నగర్, నర్సాపూర్, ఇనాయత్ నగర్, కోన సముందర్, మానాల దాని పరిధిలోని 8 తండా పంచాయితీల బీఆర్ఎస్ పార్టీ కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సతీసమేతంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి కేసీఆర్ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు లేని ఏ పార్టీ మనుగడ సాగించలేదని, బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నుదన్ను అని అన్నారు. కార్యకర్తలకు న్యాయం చేయలేని రోజున స్వచ్ఛందంగా తానే రాజకీయ సన్యాసం తీసుకరుంటానని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో 3వేల మంది లబ్ధిదారులకు 3 లక్షల చొప్పున ఇండ్ల నిర్మాణం కోసం ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఈ పథకంలో అర్హులైన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామన్నారు. ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని సర్వేలు చేసినా కేసీఆర్ మూడవ సారి గెలుస్తున్నాడనే వస్తుందని, అందుకే ఎమ్మెల్యేలను కొని కేసీఆర్‌ను దించాలని బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఏదో ఒక రకంగా కేసీఆర్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని అందులో భాగంగానే కేసీఆర్ బిడ్డను ఇప్పటికే నాలుగు సార్లు విచారణ పేరుతో ఈడీ కార్యాలయానికి పిలిచి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రధాని మోడీ దేశాన్ని ఆదాని చేతిలో పెట్టారని, దీనిపై కేసీఆర్ ప్రశ్నిస్తే కుటుంబ పాలన, అవినీతి అంటూ బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆదాని అవినీతిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని దేశంలోని అన్ని పార్టీలు అడుగుతున్న ప్రధాని మోడీ మాత్రం మౌనంగా ఉంటూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని దోచిన ఆదానిపై ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు?. ఆదానిపై జేపీసీ వేయాలని ఈడీ, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. 12 రాష్ట్రాల్లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోసి డబ్బులతో ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్న ఘనత బిజెపి దని విమర్శించారు. అంతకు ముందు మంత్రికిబీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంత్రి నాయకులు, కార్యకర్తలను పలకరించారు. కుటుంబ సభ్యులతో వచ్చిన బీఆర్ఎస్ నాయకులతో మంత్రి తన సతీమణితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు.



మాట్లాడుతున్న మంత్రి



కార్యకర్తలతో ఫోటోలు దిగుతున్న మంత్రిదంపతులు



కార్యకర్తలను పలకరిస్తున్న మంత్రి దంపతులు

పిప్పర్మెంట్లకు కూడా సరిపోనీ కేంద్ర బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన బడ్జెట్ దేశంలో చిన్న పిల్లల పిప్పర్మెంట్లు కొనుక్కోవడానికి కూడా సరిపోదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం బడ్జెట్‌లో కేవలం 2000 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో లక్ష యాభై వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలోని 50 బీసీ కులాల కోసం కోకాపేటలో ఐదు ఎకరాల్లో భవనాలను నిర్మించి ఇస్తుందన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బీసీల కోసం గురుకులాలను ఏర్పాటు చేసి బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి లక్ష ఇరవై ఐదు వేలు ఖర్చు చేస్తుందన్నారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను ఆయన సభలో వెల్లడించారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, డాక్టర్ మధు శేఖర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు రాధా రాజా గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు లుక్క గంగాధర్, సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలోని కోన సముందర్‌లో స్థానిక సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సింహాచలం, ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజా గౌడ్, సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, ఉప సర్పంచ్ పేరం లింబాద్రి, సింగిల్ విండో చైర్మన్ సామా బాపురెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, విండో కార్యదర్శి రాజేశ్వర్, సింగిల్ విండో డైరెక్టర్లు, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బోగ అమర్, రైతులు, నాయకులు, సివిల్ సప్లై అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



మాట్లాడుతున్న ఫాస్టర్

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెల్మల్ సిఎస్ఐ చర్చిలో ఉదయం నాలుగు గంటలకే మహిళలు కొవ్వొత్తులతో శిలువ వెలిగింపు చేపట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవ. బి కృపాకర్ మాట్లాడుతూ.. నలభై రోజుల పాటు చేసిన ఉపవాస ప్రార్థనలు ముగిశాయన్నారు. అనంతరం క్రైస్తవ సోదరులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ పెద్దలు, స్టూవర్డ్ సతీష్, సెక్రెటరీ ప్రభాకర్, సంఘ పెద్దలు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులను ప్రారంభించిన ఎంపీపీ



పనులను ప్రారంభించిన ఎంపిపి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కుంచాల విమల రాజు ప్రారంభించారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో పోచమ్మ గుడి నుండి పుప్పాల నదిష్ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులను, పుప్పాల సంఘం నుండి మెయిన్ రోడ్ వరకు 10 లక్షల నిధులతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. రోడ్డుపనులను ఎంపీపీ కుంచాల విమల రాజు, జడ్పిటిసి తనజ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ జయ గిరిధర్, కో ఆప్షన్ మెంబర్ అక్బర్ ఖాన్, మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, చింతలూరు సర్పంచ్ సుకన్య ప్రసాద్, ఉపసర్పంచ్ జలంధర్, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, ఒజ్జం రవీందర్, చిన్నారెడ్డి, కాంట్రాక్టర్ మైదం రాజన్న, వార్డ్ మెంబర్ పుష్ప, విడీసీ అరవింద్, శేఖర్, సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

ఏర్గట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997 -1998 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పదవ తరగతి చదివి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా అందరం ఒకేచోట కలుసుకున్నామని అన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన పూర్వ విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా గడిపారు.త్వరలో ఉపాధ్యాయులందరిని ఒకేచోట చేర్చి సన్మాన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు : ఎస్ఐ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల పరిధిలోని రైతులు వరి ధాన్యం, మక్కలు, ఇతరాత్ర పంటలు రోడ్లపై అరబెట్టొద్దని ఎస్ఐ వంశీ క్రిష్ణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పంటలు, రోడ్ల మీద అరపోయడం వల్ల ప్రమదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రమాదాలను నివారించేందుకు కల్లాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రోడ్ల మీద ఎటువంటి ధాన్యాలను ఉంచకుండా చూడాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

18న ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

- సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ
- టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసును సిబిఐకి అప్పగించాలి
- హైదరాబాద్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో దీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 18 న అఖిలపక్షం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ధర్మాగ్రహ దీక్ష ను విజయవంతం చేయలని సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జె వి చలపతిరావు కోరారు. నిజామాబాద్ నగరంలో కోటగల్లీ ఎన్ఆర్ భవన్ లో అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ (యం-యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీలో జరిగింది పేపర్ లీకేజీ అని, దాని వెనుక కేవలం ఇద్దరు ఉద్యోగుల హస్తం ఉన్నదని ప్రభుత్వం తరపున కేటీ రామారావు చేస్తున్న ప్రచారాన్ని అఖిల పక్షం తిరస్కరిస్తుందని అన్నారు. పాలకుల అవినీతి, అసమర్ధ వల్లనే పేపర్ లీకేజి జరుగుతున్నదని, అది పెద్దల అండదండలతో ఒక వ్యాపారంగా ఎదిగిందని తెలిపారు. పాలకులు చేస్తున్న ప్రశ్నా పత్రాల వ్యాపారం విద్యార్థుల జీవితంలో నిప్పులు పోసిందన్నారు. దీనివల్ల విద్యార్థులు టీఎస్‌పీఎస్‌సీపైనే కాదు, తమ భవిష్యత్తు పైనా నమ్మకం కోల్పోయారని తెలిపారు. ఈ నేపధ్యంలో విద్యార్థులకు భరోసా కలగాలంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల పక్షంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రశ్నా పత్రాల వ్యాపార నేరానికి ఇద్దరు ఉద్యోగులే బాధ్యులని తీర్పు ఇచ్చిన ప్రభుత్వం ఈ కుంభకోణం వెనుకనున్న పెద్దలను రక్షించే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అందుకే కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో నేరం జరిగిందో ఆ అధికారులు కొనసాగటానికి వీలు లేదని, పైగా వారి నేతృత్వంలో పరీక్షలు సక్రమంగా జరుగుతాయన్న నమ్మకం లేదని, అందుకే ఛైర్మన్, సెక్రటరీ, బోర్డు సభ్యులను తొలగించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన కొత్త బోర్డును ఏర్పాటు చేసి ఆ బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలు జరపాలన్నారు. రద్దయిన పరీక్షకు హాజరైన అభ్యర్థులందరికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పులు పునరా వృతం కాకుండా ఉండాలంటే టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలని సిట్టింగ్ హై కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ప్రశ్నాపత్రాల లీకేజి వ్యతిరేక పోరాట కమిటీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈనెల 18 న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్మాగ్రహ దీక్ష విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు తాహెర్ బిన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పల్లి కొండ నర్సయ్య, ఉపాధ్యక్షులు గణేష్, సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వరదయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ అర్బన్ నాయకులు అజరోద్దీన్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ సత్యం, ఇఫ్టు జిల్లా కార్యదర్శి దాసు ప్రసంగించారు. వేల్పూర్ భూమయ్య, పరుచూరి శ్రీధర్, శివకుమార్, ప్రిన్స్, దేవిక, మనోజ్, మార్క్స్, పద్మ భారతి, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఘనంగా ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం



ఇందిరాగాంధీకి నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎన్ఎస్‌యూఐ 53వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఎన్ఎస్‌యుఐ జెండా ఎగురవేసి ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నరాల రత్నాకర్, ఇతర ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నరాల రత్నాకర్, ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, నాణ్యమైన విలువల ఆధారంగా బాధ్యతాయుతమైన పౌరులు, నాయకులను రూపొందించేందుకు విద్యార్థి సమాజానికి సాధికారత కల్పించాలనే లక్ష్యంతో 1971లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎన్ఎస్‌యూఐని ఏర్పాటు చేశారని అన్నారు. విద్యార్థి దశ నుండే ప్రశ్నించే తత్వం సమస్యలపై పోరాడే తత్వం నాయకత్వ లక్షణాలను పెంపొందించి తీర్చి దిద్దుతుందని తెలిపారు. విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉండాలని, సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలపై ఎల్లవేళలా అధ్యయనం చేస్తూ సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యలపై విస్తృతంగా పోరాటం సాగిస్తూ సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు శ్రమిస్తూ ఉందని వారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకోచ్చే వరకు ఎన్ఎస్‌యూఐ విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు ప్రీతం, సృజన్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్, ప్రధాన కార్యదర్శి భాను, నిఖిల్ రెడ్డి, సయ్యద్ అశ్రాఫ్, ఓబీసీ సెల్ అధ్యక్షులు రాజా నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జవాలాల్ బల్ అధ్యక్షులు సంతోష్, డిసిసి డెలిగేట్ లవంగ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పలు గ్రామాలలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాలు కొనసాగుతున్నాయిఈ కార్యక్రమం ప్రారంభమై 55 రోజులు కావస్తున్నప్పటికీ కంటి వెలుగు వైద్యులు శిబిరాలను నిర్వహిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎడపల్లి, మంగళ్ పహాడ్, కుర్నపల్లి, తానాకలాన్, ఏఆర్పి క్యాంప్ ,బ్రాహ్మణపల్లి, జమలం, జానకంపేట, నెహ్రూ నగర్, ధర్మారం తదితర గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమాలను నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలను వైద్యులు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమాలను ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ, డిఇఓ ప్రశాంత్, ఆసుపత్రి వైద్యులు రాజ్ కుమార్‌తోపాటు ఆసుపత్రి పాలనాధికారి రాములు పర్యవేక్షిస్తున్నారు. కంటి సమస్యలున్నవారికి ప్రత్యేకంగా అద్దాలు తెప్పించ డానికి వైద్యులు వారి పేర్లను రిఫర్ చేశారు. కంటి అద్దాలు వచ్చిన తర్వాత లబ్దిదారులకు అందించినట్టు కంటి వెలుగు వైద్యులు వెంకటి, వాయిద్యాధికారి రాజ్ కుమార్ తెలిపారు. మండలంలో సుమారుగా 3 వేలకు పైగా మందికి ఉచితంగా కంటి పరీక్ష నిర్వహించి అద్దాలు పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం బాపునగర్‌లో నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో సర్పంచ్ మెగావత్ సునీత రవికుమార్, వైద్య అధికారి రాజ్ కుమార్, అంగన్వాడి ఉపాధ్యాయులు ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బాపునగర్‌లో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామగ్రామాన సీసీ రోడ్లు

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల కృషి



కుర్నాపల్లిలో పూర్తయిన సీసీ రోడ్డు

నవతెలంగాణ ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి, ఎడపల్లి, మంగళ్ పహాడ్, తానా కలాన్, నెహ్రూనగర్ గ్రామాల్లో ఉపాధి పథకంలో భాగంగా సుమారు 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులను చేపడుతున్నారు. ఈగ్రామాల్లో సిమెంటు రోడ్లు పూర్తయ్యాయి. మిగతా గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధులు నిధులకోసం ప్రతిపాదనలను సంబంధిత అధికారులకు నివేదించినట్లు సమాచారం. ఎస్ఆర్ఈజీఎస్ నిధులే కాకుండా ఇతర నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వీధులలో కూడా సిమెంటు రోడ్లు వేస్తున్నారు. ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ తో పాటు జెడ్పి వైస్ చైర్ పర్సన్ రజిత ఎల్లయ్య యాదవ్ ఆయా గ్రామాల సర్పంచులు మండల , గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న బోధన్ ఎమ్మెల్యే ఎండి షకిల్ అమీర్ కు మండల ప్రజా ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

టీఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. నాంపల్లి

నవతెలంగాణ-కోటగిరి

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని టీఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణిగుంట నాంపల్లి డిమాండ్ చేశారు . ఆదివారం పోతంగల్ మండలంలోని చేతన్‌నగర్ గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.నా నిమ్న వర్గాల్లో జన్మించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిన్నప్పుడే ఎన్నో వివక్షలను ఎదుర్కొన్నారని, చదువుకు కూడా ఇబ్బందుల మధ్య కొనసాగించారని ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉన్నత చదువులు చదివి కేంద్ర మంత్రిగా, భారత మాజీ ఉప ప్రధానిగా పదవులు చేపట్టారని తెలిపారు. నేడు ప్రజలకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ కారణమని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలు, దళిత సమాజం అభివృద్ధి చెందాలన్నా, చైతన్యం కావాలన్నా చదువే ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉన్న వారు స్థానిక నాయకులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన శ్రీలేఖ బీర్కూర్ వైద్యాధికారి కావడం చేతన్ నగర్ వాసులకు గర్వకారణమని, ఆమెను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగనాథ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు నాగయ్య మండల నాయకులు నాగేష్, దేగం సాయిలు, కార్యపురం సాయన్న, హనుమంతు, జిల్లా నాయకులు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు చంద్రయ్య, విద్యాసాగర్, మాదిగ మేధావుల పురం జిల్లా సహాయ కార్యదర్శి లింబూరి లక్ష్మణ్, బీర్కూర్ మండల వైద్యాధికారి డాక్టర్ జెండా శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేణిగుంట నాంపల్లి

యాదవ సంఘం కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా జక్కుల సిద్ధ రాములు, ఉపాధ్యక్షులు రమణ బోయిన మల్లేష్, జనరల్ సెక్రటరీగా రమణబోయిన రాజేందర్, ట్రెజరీగా జక్కుల రవికుమార్, జాయింట్ సెక్రెటరీగా గోరింటాల లక్ష్మణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం సభ్యులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



ప్రతినిధులను సన్మానించిన ఆలయ కమిటీ

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి దంపతులు, అసిస్టెంట్ గవర్నర్ విజయ సారథి, కామారెడ్డి జిల్లా రోటరీ క్లబ్ అధ్యక్షులు సిరి గాద లక్ష్మీ నర్సింలు దంపతులు, సెక్రటరీ పోల బోయిన సత్యం దంపతులు మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి రోటరీ క్లబ్ గవర్నర్, అధ్యక్షులను శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు హరీస్మరన్ రెడ్డి, భాస్కర్, రాజనర్సింహారెడ్డి, సుధాకర్, కాశీనాథం, గంగారెడ్డి, ఆలయ అర్చకులు రాజేశ్వర శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్రస్.. బీఆర్ఎస్

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జుక్కల్ నియోజకవర్గంలో అనేక పనులు
- ఎమ్మెల్యే, ప్యానెల్ స్పీకర్ హన్మంత్‌షిండే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



సమ్మేళనానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించింది.. నడిపిస్తుంది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని జుక్కల్ ఎమ్మెల్యే, ప్యానెల్ స్పీకర్ హన్మంత్ షిండే అన్నారు. ఆదివారం జుక్కల్ మండల కేంద్రంలో మండలంలోని ఇరువై నాలుగు జీపీల ప్రజాప్రతినిధులతో, కార్యకర్తలతో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని విండో మాజీ చైర్మన్ రాజు పటేల్ చదివి వినిపించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశమంతా విస్తరింపచేసి అభివృద్ధి చేయాలనే టీఆర్ఎస్ రాష్ట్ర పార్టీని బీఆర్ఎస్ జాతీయపార్టీగా సీఎం కేసీఆర్ మార్చినట్టు తెలిపారు. వివిధ గ్రామల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే సంవత్సర కాలంలో ఎన్నికల నగరా మొగనుందని, ముందుగానే ప్రజల్లోకి వెళ్లి తెలంగాణ సర్కార్ ముఖ్యమంత్రి కేసిఆర్ చేపట్టి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి ఏదో ఒక రకంగా లబ్దిచేకూరుస్తున్నాయని, వాటిపై ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాలలో గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ది పొందిన వారిని గుర్తించి బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని, లబ్ది పొందని వారుంటే సమస్యలు ఎక్కడ వస్తున్నాయో తెలుసుకొని అర్హులై ఉంటే వారికి తప్పక సంక్షేమ పథకాలను వారి దరికి చేర్చాలని సూచించారు.

జుక్కల్ మండలంలో 40 ఏండ్లుగా జరగని రహదారుల అభివృద్దిని తాము పూర్తి చేసి చూపామని తెలిపారు. కళ్యాణలక్ష్మి పథకంతో వేలాది కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని, రైతులకు రైతు బీమా, పెట్టుబడి సహయం అందిస్తున్నామని, దోస్పల్లిలో ఇరువై రెండు మందికి దళితబంధు అందించామని, గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ చేశామని తెలిపారు. రెండవ విడత త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకంలో తాగునీరు అందిస్తున్నామని, కౌలాస్ నాళా ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తున్నామని, గర్భిణులకు పౌష్టికాహారం, బాలింతలకు కేసిఆర్ కిట్టు, ఆడ, మగ బిడ్డ పుట్టినా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వృద్దులకు, వికలాంగులకు, వితంతులకు, ఒంటరిమహిళలకు, బీడీకార్మీకులకు ఇతరులకు పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు తీరు చేసిన విధానం చూసి దేశంలో ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాలు నివ్వేర పోయేలా అమలు చేసి చూపినట్టు తెలిపారు. ఇతర దేశాల నాయకులు దేశంలోని ఇతర రాష్ట్రాల వారు పొగుడుతున్నారని తెలిపారు. రాష్ట ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి వివిధ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవార్డులు ఇస్తుందని, కానీ ఒక్క పైసా కూడా సహయం చేయడంలేదని , చివరికి వరి కొనుగోలు కూడా చేయడం లేదని అన్నారు. రాష్ట్రం ఒక్క విత్తు కూడా వదలకుండా వరి, చెనిగెలు , పత్తి మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా ఉంటున్నట్టు తెలిపారు.

మహిళలకు జీపీలలో యాభై శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలలో సముచిత స్థానం కల్పించామని చెప్పారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, బంగారు తెలంగాణలో తామందరమూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కార్యకర్త కష్ట పడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ర్యాలీగా సభస్థలానికి కార్యకర్తలతో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షిండేను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యశోదా నీలుపటేల్, వైస్ ఎంపిపి ఉమాకాంత్, విండో చైర్మన్ శివానంద్, మాజీ చైర్మన్ రాజుపటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయాగౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయాగ్రామాల సర్పంచులు. సినియర్ నాయకుడు నీలుపటేల్, వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఇంటింటికీ తెలుగుదేశం

నవతెలంగాణ-బోధన్

టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు బోధన్ పట్టణంలోని 14 వ వార్డు ఆజాంగంజ్‌లో ఇంటింటికి తెలుగుదేశం పేరుతో కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గోపాలరెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ జనరల్ సెక్రటరీ హనుమంతరావు, పట్టణ అధ్యక్షులు భాస్కరరావు, నాయకులు సచిన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం ఆర్థిక సాయం అందజేసినట్టు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పోకల సాయిరాం తెలిపారు. లింగంపేట్ గ్రామానికి చెందిన పటేల్ దేవరాజు తాడ్వాయి మండల సమీపంలోని కృష్ణాజివాడ గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఆటో బైక్ ఢీకొనడంతో లింగంపేట గ్రామానికి చెందిన పటేల్ దేవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. కాగా పటేల్ దేవరాజ్ అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు సాయితేజ, నెల రోజుల కుమారుడు ఉన్నాడు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటిపోయాయి. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని వారన్నారు.

వంట పాత్రల వితరణ



ఆలయానికి వంటపాత్రలు అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులోని శ్రీ రామలింగేశ్వర ఆలయానికి వినోద్ కుమార్ (యూఎస్ఏ) ఆదివారం వంట పాత్రలు అందజేసినట్లు శివగిరి మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే సందర్శకులకు అన్నదానం నిర్వహించేందుకు వంట పాత్రల కొరత ఉండటంతో వినోద్ కుమార్ స్పందించి వంట పాత్రలను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి , రాజశేఖర్ రెడ్డి, సాయా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశంతో ఎస్సీ వాడలో నీటివసతి



పైప్‌లైన్ కోసం తవ్వకాలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలం లోని గుండె కల్లూర్ గ్రామంలోని ఎస్సీ వాడలో నీటి వసతి కల్పిం చాలని ఫథలాపూర్‌లో ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో గుండె కల్లూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే హనుమంత్ షిండే దష్టికి తీసుకువచ్చారు. వెంటనే పనులు మొదలుపెట్టి నీటి వసతి కల్పించాలని సర్పంచ్ సంగీత, మాజీ సర్పంచ్ సాయిగొండకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆదివారం గ్రామంలోని ప్రధాన నీటి ట్యాంకు వద్ద నుండి ఎస్సీ వాడ వరకు 300 మీటర్లు తవ్వకాలు జరిపి నీటు పైపులు వేసి ఎస్సి వాడలో తాగునీటి వసతి కల్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సాయి కొండ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే హనుమంత్ షిండే దష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి తాగునీటి వసతి కోసం నిధులు కేటాయిస్తానని వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. గ్రామస్తులు, ఎస్సీ వాడాలోని ప్రజలు ఎమ్మెల్యే హనుమంత్ సిండేకు కతజ్ఞతలు తెలిపారు.

దాబాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు




ఎస్ఐ గణేశ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దాబాలలో మద్యం సేవిస్తే.. సేవించిన వారితో పాటు దాబా యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దాబా యజమానులు మద్యం విక్రయించడం కానీ, మద్యం సేవించే వారిని ప్రోత్సహించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కెమికల్ కంపెనీతో భూగర్భ జలాలు కలుషితం

- తొలగించాలని డిమాండ్



మాట్లాడుతున్న కొత్త నర్సింలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న రాఘవ లైఫ్ సైన్స్ కెమికల్ కంపెని ద్వారా వచ్చే వ్యర్థాలను భూమిలోకి వదలడం ద్వారా బోర్ల నుండి వచ్చే నీరు మనుషులు, పశువులు, పంటలకు పనికిరాకుండా పోతుందని ఆ బాధ భరించలేక చుట్టూ ఉన్న రైతులు పంటలు వేయడం మానుకున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొత్త నరసింహులు అన్నారు. ఆదివారం చుట్టూ ఉన్న పంట పొలాలను పరిశీలించి రైతులను తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంపెనీ సమీపంలో ఉన్న రైతు కెమికల్ వ్యర్థాలు ఆ దుర్వాసన భరించలేక పంట వేయడం మానుకున్నారన్నారని, కంపెనీ యాజమాన్యం అయినటువంటి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెంటనే కంపెనీని మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీతోనే సంక్షేమ పథకాలు షురూ

- ఇంటింటా తెలుగుదేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ మహేష్



ఇంటింటా ప్రచారం చేపడుతున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేసి చూపిన ఘనత ఉమ్మడి రాష్ట్రంలోని గత టీడీపీ ప్రభుత్వానిదే నని ఆ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ మహేశ్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు లింగంపేట్ మండల కేంద్రంలోని ముంబోజిపేట్ గ్రామంలో ఆదివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముడెగాం మహేష్ మాట్లాడుతూ తెలుగుదేశ ప్రభుత్వం గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యునికి 2 లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు.

ఐటీ రంగంలో దేశంలో మొట్ట మొదటి స్థానం హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత టీడీపీదే అని తెలిపారు. గతంలో 2 రూపాయలకు కిలో బియ్యాన్ని అమలు చేశామని చెప్పారు. అలాగే వృద్ధాప్య పింఛన్లు ప్రవేశపెట్టింది తమ పార్టీయే అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తెలుగుదేశానికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి తీరుతుందని తెలిపారు. ప్రజలు అభివృద్ధి చేసే పార్టీకి పట్టం కట్టాలని కోరారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్దే ఉందన్నారు. ప్రజలు తిరిగి అభివృద్ధిని కోరుకుంటు న్నారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీని ఇంటింటికి తీసుకువెళ్తామని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామ గ్రామానికి ఇంటింటికి తెలుగదేశం కార్యక్రమం మరింత ఉధృతం చేస్తామని గడప గడపకు వెళ్లి సభ్యత్వం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడేగాం మహేష్, మహిళా నాయకురాలు ముదాం స్వప్నా చిరంజీవి, మంబోజిపేట్ రాజు, కోరే పెద్ద నారాయణ, బోయిని నారాయణ, కోరి పెద్ద లక్ష్మయ్య, కోరి శ్రీనివాస్, చందు, అంజయ్య, అందే మహేష్, కోరి శ్రీనివాస్, రాజులు, ప్రశాంత్, జనార్దన్ గౌడ్, కాశీరాం, అంజయ్య, పోచయ్య, రాములు, మహేష్, సంపత్, రవీందర్, చిరంజీవి, రాములు, గంగాసాగర్, లక్ష్మీ బోయిని జానకవ్వ, మంజుల, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు

- విద్యార్థులకు అండగా ఎన్ఎస్‌యూఐ :
- ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు



కేక్ కట్ చేసి సంబురాలు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించాయని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే పోరాటంలో ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడు ముందు ఉంటుందని అన్నారు. ఎన్ఎస్‌యుఐ 53వ ఆవిర్భావ దితన్సోవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును రూపొందించండంలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. 1971లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ ఏర్పడిందని, ఇందులో పని చేసిన చాలా మంది నాయకులు జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. విద్యా, ఉద్యోగ హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు భరత్ టింకు, యువజన కాంగ్రెస్ నాయకులు పెన్సిల్వార్ శ్రీధర్, నాయకులు శ్యామ్ సుందర్, సోఫియాన్, గౌతమ్, సన్నీ, ప్రభు, దీప్ సాయి, ప్రకాష్, సాయి కిరణ్, , రాగూర్, సాయి గణేష్, నాగేంద్ర కళ్యాణ్, అభిలాష్,ఆకాష్, యశ్వంత్, ఆనంద్, సాయినాథ్, మనోహర్ దినేష్, సుభాష్ రుద్రేశ్, శ్యామ్ గౌతమ్, వేణు, విష్ణు, జగదీష్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామాల్లో 'రాజకీయ బలగం'

- చిత్రం ప్రదర్శించేందుకు ప్రధాన పార్టీల ఆసక్తి
- చివరలో నాయకుల ప్రచారం..



బలగం సినిమా చూస్తున్న గ్రామస్తులు



నవతెలంగాణ-లింగంపేట్

జిల్లా వ్యాప్తంగా 'బలగం' ఫీవర్ పట్టుకుంది. బంధాలు బంధుత్వాల విలువ తెలియజేసే విధంగా గ్రామీణ ప్రాంత నేపథ్యంతో తీసిన బలగం సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. గ్రామాల్లో ప్రత్యేక తెరలు ఏర్పాటు చేసి చిత్రం ప్రదర్శిస్తున్న విషయం తెలిసింది. కాగా చిత్రం ప్రదర్శించడంలో పలు రాజకీయ పార్టీలు అమితా సక్తి చూపుతు న్నాయి. బలగం ఫీవర్‌ను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు నాయకులు ప్రయత్నిస్తున్నారు. తెరలు ఏర్పాటు చేసి సినిమా ప్రదర్శిస్తూ.. చివరలో తమ ప్రచారం చేసుకుంటున్నారు.

బంధాలు, బంధుత్వాలు, విడిపోయిన బంధాల విలువలను తెలియజేసే విధంగా తెరకెక్కించిన బలగం సినిమాకు రోజుకింత ఆదరణ పెరుగుతోంది. దీంతో పల్లెపల్లెల్లో చావిడిల వద్ద తెరలు ఏర్పాటు చేసి మరీ సినిమాను ప్రదర్శిస్తున్నారు. దీంతో ఏ ఇద్దరిని పలకరించిన మాట్లాడిన వారి ముచ్చట్లల్లో బలగం సినిమా ఉంటుంది. దీంతో దీన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వివిధ పార్టీల నాయకులు ప్రయత్నిస్తున్నారు. పోటాపోటీగా సినిమాను ప్రదర్శనలు చేపడుతున్నారు. దీంతో పాటు ప్రత్యర్థులను ఎత్తిపోయడానికి ఈ టైటిల్‌ని ఉపయోగిస్తున్నారు. గ్రామాల్లో ఆయా పార్టీల చెందిన ప్రజాప్రతినిధులు పోటాపోటీగా బలగం సినిమా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీలో చెందిన నాయకులు కార్యకర్తలు బలగం అంటూ పోస్టల్ వేసుకొని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కొందరు నాయకులు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తున్నారు. సినిమా ప్రదర్శించిన తర్వాత చివరలో తమ ప్రచారం చేపడుతున్నారు. తమ పార్టీ అందరికి అండగా ఉంటుందని చెబుతున్నారు.

లింగంపేట్ మండలంలోని బానాపూర్ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ప్రదర్శన నిర్వహించ డంతో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆసక్తితో తిలకించారు. లింగంపేట్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లోని కాళీ ప్రదేశంలో బలగం సినిమాను ప్రదర్శించడంతో పెద్దఎత్తున రెస్పాన్స్ వచ్చింది. శనివారం రాత్రి శెట్టిపల్లి గ్రామంలో పోల్కంపేట గ్రామంలో బలగం సినిమాను ప్రదర్శించారు. ఆదివారం లింగంపేట్ మండల కేంద్రంలోని రాఘవేంద్ర మెడికల్ వద్ద ప్రదర్శన ఏర్పాట్లు చేశారు. ఒక్క లింగంపేట్ మండలమే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శిస్తున్నారు.

ఈస్టర్ దినోత్సవ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



భిక్కనూర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన క్రైస్తవులు

నవతెలంగాణ-లింగంపేట్/భిక్కనూర్

ఈస్టర్ దినోత్సవం పురస్కరించుకొని క్రైస్తవులు ఆదివారం చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఉదయం నుండి పాటలతో ఏసు ప్రభును తలుచుకున్నారు. మండలంలోని రాంపూర్, పోల్కంపేట్, మోతే, ఎక్కపల్లి, శెట్టిపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, కోర్పోల్, లింగంపేట్ మండల కేంద్రంలోని పలు చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భిక్కనూర్: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఆదివారం బాప్టిస్ట్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్సన్ ఏసుక్రీస్తు బోధనలను భక్తులకు వివరించారు. జీసస్ చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్షపతి, పంచాయతీ సిబ్బంది స్వామి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు స్వామి, శాంతి కుమార్ భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న బొలెరోలు పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు బొలెరో వాహనాలు తరలింపు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూరు మండలం శివారు ప్రాంతంలోని మంజీరా నది పరివార ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బీర్కూర్ మంజీరనది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నంబరు లేని మూడు మహేంద్ర బొలెరో వాహనాలు పట్టుకుని, బొలెరో వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఏ ఎస్ ఐ సీతారామమ్మ తెలిపారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పిట్లం

పక్క జిల్లా అయినటువంటి సంగారెడ్డి పరిధిలోని కంగ్టి మండల కేంద్రమునకు చెందిన మచ్కూరి సురేఖ(20) తలలో ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి చంచల్ గూడ సెంట్రల్ జైల్ ఎస్ పి నవాబ్ శివకుమార్ గౌడ్ ఆదివారము 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.

పిట్లం మండల కేంద్రానికి చెందిన ఎస్పీ శివకుమార్ గౌడ్ బాధితురాలైన మచ్కూరి సురేఖ తలలో ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆమెకు శాస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించి 6 ఆరు లక్షల రూపాయలు ఖర్చవుతుందని తెలపడంతో చిన్నప్పుడే నాన్నను కోల్పోయిన సురేఖ దీనగాధ వార్త విని చలించి పోయిన ఎస్పీ ఆర్థిక సహాయం అందజేశారు.

కారుకింద పడి బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు

నవతెలంగాణ-కామారెడ్డి

అప్పటి వరకు ఆడుకుంటూ అల్లరి చేసిన బాలుడు.. ప్రమాదవశాత్తు కారు కింద పడి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన కామారెడ్డిలోని ఇస్రోజీవాడిలో ఆదివారం చోటుచేసుకుంది. దేవునిపల్లి ఎస్ఐ ప్రసాద్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్ధం స్వామి కారును ఇంటి నుంచి బయటకు తీస్తుండగా వెనుకాలే వెళ్లిన ఆయన కొడుకు ఆయాన్స్(1)పై నుంచి ప్రమాదవశాత్తు వెళ్లింది. దీంతో కుటుంబీకులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే బాలుడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలోని సపయ్ రాజుబాయ్ ఇల్లు సిలిండర్ పేలి, దగ్ధం అవడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పారు. తక్షణ సహాయం కింద ఆదివారం పైడి రాకేష్ రెడ్డి (ఆర్ ఆర్) ఫౌండేషన్ ద్వారా 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడంతోపాటు గృహ అవసరాలకు కూడా ఆర్థిక సహాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మట్టకర్రన్న, సురేష్, భూమేష్, మోహన్, అమృతరావు, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మొర్రిపండ్లు పోషకాలు మెండు..



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కొన్ని పండ్లు ఎండాకాలం సిజనల్‌లో కాకుండా వేరే కాలం దొరకవు. అలాంటివాటిలో మొర్రిపండ్లు ఒకటి. ఒక గ్లాసుకు 10 రుపాయలకు విక్రయిస్తున్నారు. మళ్లీ సిజనల్ తరువాత లభించవని అందరూ కొనుగోలు చేస్తున్నారు. ఇవి శరీరానికి ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి.

ఎప్పటిలాగే సహకారం అందిస్తా : ఎమ్మెల్యే బిగాల

- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్లో అడహక్ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథం శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి మల్లేష్, కోశాధికారి సిద్ధంశెట్టి విజయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బ్రాహ్మణపల్లి బాల్ దాస్ అధ్వర్యంలో నిర్వహించిన ఆర్య వైశ్య పట్టణ సంఘం, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారుల స్వాగతం నృత్యం అలరించింది. అనంతరం ముఖ్య అతిథులు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం నూతన అధ్యక్షులుగా కొండ వీరశేఖర్ గుప్తా, మాణిక్ భవన్ సంఘం నూతన అధ్యక్షులుగా ధన్‌పాల్ శ్రీనివాస్, యువజన సంఘం నూతన అధ్యక్షులుగా ఇల్లందుల ప్రభాకర్ గుప్తా, వైశ్య భవన్ నూతన కమిటీ అధ్యక్షులుగా చందూరు ధర్మేంద్ర గుప్తా, కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ నూతన అధ్యక్షులుగా పెండ్యాల శ్రీనివాస్ (వాసు) గుప్తా, గ్రాడ్యుయేట్ సంఘం (ఆవోగా) అధ్యక్షులుగా కుకుట్ల నవీన్ కుమార్ గుప్తా, ఆర్యవైశ్య మండలి నూతన అధ్యక్షురాలిగా దొంతుల ధనలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ముఖ్య అతిథులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఐక్యంగా పెద్దల సలహాతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. తన వంతు సహకరంగా 70 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆర్యవైశ్య సంఘం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనానికి కోటి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం నుండి మంజూరు చేయించానని తెలిపారు. భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని దూర ప్రాంతాల నుండి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు కోటి రూపాయలతో ఆర్యవైశ్య హాస్టల్ నిర్మిస్తున్నామని తెలిపారు. తన నాన్న జ్ఞాపకార్థంగా పట్టణ సంఘానికి 25 లక్షల రూ.జిల్లా సంఘానికి 10 లక్షల రూ.విరాళంగా ఇచ్చినట్టు చెప్పారు. కార్యవర్గ సభ్యులు సంఘం కీర్తిని పెంచేలా సేవ ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ ఎప్పటిలాగే సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కుటుంబంలో మధ్యతరగతి, పేదవారు నలిగిపోతున్నారని, అటువంటి కుటుంబాల అండగా ఉందామన్నారు. సంఘ సభ్యులు ఆర్యవైశ్య పేదలను గుర్తించాలన్నారు పట్టణ సంఘ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, ధన్‌పాల్ సూర్యనారాయణను సన్మానించారు.



ప్రమాణస్వీకారం చేసిన ఆర్యవైశ్య నూతన కార్యవర్గం

బినోలలో ఘనంగా బోనాల పండుగ



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను గ్రామ దేవతకు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పితాంబర్, ఉప సర్పంచ్ పోశెట్టి, నాయకులు విజయ్, రవి, మహేందర్ మరియు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఫోటోగ్రాఫర్ల ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

నవతెలంగాణ - బోధన్

గత కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన ఫోటోగ్రాఫర్ నారాయణ కుటుంబానికి ఆదివారం ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. బోధన్ పట్టణంలోని వీరశలింగం పార్కులో ఏర్పాటుచేసిన అసోసియేషన్ సమావేశంలో వారు 1.35 లక్షల రూపాయల చెక్కును అందించారు. ఈ సంధర్భంగ వారు మాట్లాడుతూ హార్ట్‌ఎటాక్‌తో మరణించిన ఫోటో గ్రాఫర్ నారాయణ గతంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ వారు ప్రవేశ పెట్టిన కుటుంబ భరోసా పథకంలో చేరి ఉండడంతో వారి కుటుంబానికి జిల్లా, బోధన్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కుటుంబ భరోసా కార్యక్రమంలో భాగంగా 1.35 లక్ష రూపాయల చెక్కును అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిరుపేద కుటుంబాలకు ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్ అని జక్రాన్‌పల్లి ఎంపీపీ కుంచాల విమల రాజు ఆదివారం అన్నారు. మండలంలోని చింతలూరు గ్రామానికి సీఎం సహాయనిధి కింద మంజూరైన 44వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎంపీపీ కుంచల విమల రాజు, జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ లబ్ధిదారుడు గోపిడి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జయగిరిధర్, కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, సర్పంచ్ సుకన్య ప్రసాద్, ఉప సర్పంచ్ జలంధర్, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, ఓజ్జం రవీందర్, గోపిడి చిన్నారెడ్డి, మైదం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న మదన్‌మోహన్

నవతెలంగాణ-లింగంపేట్

తాడ్వాయి మండల సమీపంలోని కృష్ణ జివాడ గ్రామ సమీపంలో బ్రహ్మాజీవాడ మలుపు వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతిచెందారు. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన దేవరాజు పటేల్, నరేష్, బాబు ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి కామారెడ్డి నుండి లింగంపేట వస్తున్నారు, కృష్ణాజివాడ సమీపంలోని బ్రహ్మాజీవాడ మలుపు వద్ద ఆటో బైకు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దేవరాజు పటేల్ అక్కడికక్కడే మృతిచెందగా నరేష్, బాబు కామారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దు అండగా ఉంటాను అన్నారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు నల్లమడుగు షరీఫ్, కాంగ్రెస్ నాయకులు లింగంపేట్ గ్రామస్తులు ఉన్నారు.

11న జీజీ చారిటీ హాస్పిటల్ ప్రారంభం

- ఒక్క రూపాయికి కార్పొరేట్ వైద్య సేవలు

నవతెలంగాణ-ఆర్మూర్



నైన్ స్టార్ హెల్త్ కేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 మంగళవారం జిజి చారిటీ హాస్పిటల్ ను ప్రారంభిస్తున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ సుచరిత రెడ్డి ఆదివారం తెలిపారు.. హైదరాబాద్ నగరంలో కార్పొరేట్ హాస్పిటల్ స్థాయి వైద్యాన్ని పేదవారికి అందించేందుకు కేవలం ఒక్క రూపాయికే డాక్టర్ కన్సల్టేషన్‌తో సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని బర్కత్‌పుర ఆర్‌ఆర్ కమర్షియల్ కాంప్లెక్స్ సుందరయ్య పార్క్ దగ్గర హాస్పిటల్లో ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. చైర్మన్‌గా శ్రీధర సీత సత్య గంగాధర్ గుప్తా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. బడుగు, బలహీన పేద ప్రజల కష్టాలను తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు విద్యావేత్తలు అన్నారు.

చిన్నారి స్మరాశిని ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్



చిత్రంలోని ఓసన్నివేశంలో స్మరాసిని

పట్టణానికి చెందిన చిన్నారి స్మరాసిని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఆనంద వాహిని కార్యక్రమంలో పాల్గొని అత్యంత ప్రతిభ కనపరచినట్టు తల్లిదండ్రులు వాసన గోదావరి, జనార్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంప్రదాయ నాట్య గొప్పతనాన్ని కీర్తిస్తూ ప్రపంచ సంగీత సాహిత్య చరిత్రలో ఇప్పటివరకు కని వినీ ఎరుగని రీతిలో తీసిన లఘుచిత్రం ఆనంద వాహిని అని జిల్లా కేంద్రానికి దర్శకులు రవి శ్రీ పారుపల్లి అన్నారు. రవీంద్ర భారతిలో జరిగిన ప్రదర్శనలో పాల్గొని అందరిచే శభాష్ అనిపించుకున్నారు. విజయ్ హై స్కూల్‌లో ఒకటవ తరగతి .చదువుతున్న స్మరాశిని పలు నాట్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులచే బహుమతులు పొందినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కవిత దివాకర్ తెలిపారు

గగ్గుపల్లి గ్రామంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు నూతన మండలం గగ్గుపల్లి గ్రామంలో ఆదివారం పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ ఆధ్వర్యంలో మెగా శాఖాహార ర్యాలీ, ధ్యాన మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు పరమహంస పరివ్రాజక బాలయోగి రాములు మహారాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉయ్యూరు శోభారాణి ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం వల్ల ఆనందం ధ్యానం వల్ల ఆరోగ్యం లభిస్తాయని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని యోగ సైతం చేయాలని శాకాహారం భుజించాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నల్లా గంగారెడ్డి నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణరెడ్డి, కూనింటి శేఖర్ రెడ్డి , అమరవాజి శ్రీనివాస్, నిశాంత్, మందిరం నిర్మాణ దాతలు సిరిగిరి అబ్బుమ్మ, రాజన్న, పోసాని తదితరులు పాల్గొన్నారు.

తాటిముంజలు డజన్‌కు రూ.120



ముంజలు కొంటున్న ప్రజలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎండాకాలం వచ్చిందంటే చాలు చలువ పదార్థాల కోసం ఎదురు చూస్తూ ఉంటాం. అందులో ముఖ్యంగా అందరూ ఇష్టపడేవి తాటిముంజలు. నిజామాబాద్ నగరంలో ప్రధాన కూడళ్లలో ముంజలు విక్రయిస్తున్నారు. డజను తాటిముంజలు 120 రుపాయల చొప్పునా అమ్ముతున్నారు. నగర ప్రజలు ఎంతో మక్కువతో కోనుగోలు చేస్తున్నారు.

జీజీహెచ్‌కు సూపర్ స్పెషాలిటీ సేవలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు 29 మంది సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు రానున్నారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్ రావు తెలిపారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో పెరుగుతున్న పేషెంట్లకు అనుగుణంగా మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను ఏర్పాటు చేయనుందని అన్నారు. 29 మంది సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు వివిధ డిపార్ట్మెంట్లలో సేవలు అందించనున్నారని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో నియామకం అవనుండడంతో పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నాణ్యమైన వైద్యం కోసం మహానగరాలకు పోయే రోజుల నుండి ఇప్పుడు ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు రావడం వల్ల ప్రజలకు మంచి వైద్యం దొరకనుందని అన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 17 మెడికల్ కాలేజీలు ఉండగా, నూతనంగా మరో తొమ్మిది మెడికల్ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభించనుందని వివరించారు. వీటి వల్ల ప్రజలకు వైద్యంతో పాటు నూతనంగా విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీని ద్వారా వైద్యంతో పాటు సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందుతుందని, ఇది కేవలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందన్నారు. దేశానికి తెలంగాణ ఆరోగ్య రంగంలో మోడల్ గా నిలిచిందని, అంతేకాకుండా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపైన నమ్మకం గణనీయంగా పెరిగిందని మంత్రి హరీశ్ రావు అన్నారు.

సిఎస్ఐ చర్చిలో కన్నుల పండువగా ఈస్టర్ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సిఎస్ఐ చర్చిలో ఆదివారం తెల్లవారు జామున శిలువ వెలిగింపు నిర్వహించారు. ఈస్టర్ పురస్కరించుకుని శిలువకు మహిళలు, ప్రజలు, యోధులు పెద్దఎత్తున కొవ్వొత్తులు వెలిగించి స్మరించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలతో చర్చి ప్రాంగణం హోరెత్తింది. చర్చి గురువుల భక్తి సూకర్లు మధ్య భక్తి గీతాలు ఆలపించారు. ఈ వేడుకల్లో చర్చి పాస్టర్ జార్జ్, ప్రకాష్, స్టాండ్లీతోపాటు సిఎస్ఐ చర్చ్ కమిటీ సభ్యులు, సిఎస్ఐ చర్చ్ సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

సెయింట్‌ఆన్స్ చర్చిలో

స్థానిక సుభాష్ నగర్‌లోగల సెయింట్‌ఆన్స్ చర్చ్ లో ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గాయక బృందం భక్తి పాటలతో అలరించారు. 40రోజులు ఆచరించిన ఉపవాసాలు పూర్తయ్యాయని ఫాదర్ తెలిపారు. కార్యక్రమంలో, నిర్మల హృదయ సిస్టర్స్, సుపీరియర్ సిస్టర్ మార్గరెట్ , పారిషనర్, కౌన్సిల్ మెంబర్స్ వై డేవిడ్, బాలస్వామి, హ్యారీ, ప్రవీణ్, అగస్టీన్ , శావ్రీ, అగ్నేస్, పుష్ప , లౌర్డు, క్రాంతి , జిమ్మీ తదితరులు పాల్గొన్నారు

కేసీఆరే నా బలం.. కార్యకర్తలే నా బలగం

- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి



హాజరైన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి కేసీఆరే తన బలమని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే తన ఆత్మీయ బలగమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చావునోట్లో తలపెట్టి స్వరాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ జాతిపిత, అభినవ గాంధీ అని అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌ను దేశ ప్రధానిగా చూడాలన్నదే తన జీవితాశయ మన్నారు. కేసీఆర్ పాలన మానవీయ కోణంలో సాగుతుంటే మోడీ పాలన అవినీతి, అవకాశవాద, రాజకీయ, ప్రత్యర్థులపై కక్ష తీర్చుకునే కోణంలో సాగుతోందని అన్నారు. బీజేపీ దేశాన్ని కొల్లగొడు తుందని, ప్రజల సంపద అదానీ పాలు అవుతుంటే మోడీ సర్కారు నవ్వుల పాలు అవుతుందని తెలిపారు. జిల్లాకు పసుపు బోర్డు తెస్తానని చెప్పి బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ అరవింద్ మాట తప్పి రైతులకు పంగనామాలు పెట్టారని జీవన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పరీక్షాపత్రాలు లీక్ చేసి విద్యార్థులకు అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాయితీ పరలు బీజేపీ లో చేరకుంటే వారిని జైలు పాలు చేస్తున్నారని, ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలు మోడీకి చుట్టాలుగా మారాయని అన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని దేశం కోరుకుంటుందని, కేసీఆర్ ను చూసి బీజేపీ వణుకుతోందని తెలపారు. దీంతో బీఆర్ఎస్ నాయకులపై ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు జరుపుతోందని తెలిపారు. "గతంలో ఆర్మూర్ ఎట్లుంది? ఇప్పుడెట్లుందన్న దానిపై చర్చ జరగాలన్నారు. ఆర్మూర్ రెవెన్యు డివిజన్ అయిందని, ఆలూరు, డొంకేశ్వర్ లను కొత్త మండలాలుగా ఏర్పాటయ్యాయని తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా ను సుందరీకరించామని, సిద్దులగుట్టకు రూ. 20 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగిందని, ఈ ఘాట్ రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటైందని, సిద్దులగుట్టను దివ్య క్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడానికి అనేక నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆర్మూర్- నిజామాబాద్, ఆర్మూర్-ఆలూరు- ఇలా దాదాపు 9బైపాస్ రోడ్లు వచ్చాయని తెలిపారు. పంచగూడ వంతెన కట్టించి రెండు జిల్లాల మధ్య దూరం తగ్గించుకున్నాం. అర్బన్ పార్క్ ను ఆర్మూర్ కు ల్యాండ్ మార్క్ గా తీర్చి దిదిద్దుకున్నాం అని అన్నారు. నియోజకవర్గంలో సామాజిక వర్గాల వారికి 200కు పైగా భవనాలకు నిధులిచ్చామని, వాటిలో దాదాపు 10 మల్టీ పర్పస్ కమ్యూనిటి హాళ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలను మంజూర య్యాయని అన్నారు. మూడో సారి బీఆర్ఎస్ ను అధికారంలోకి తెచ్చు కుందా మని, బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణపై కక్ష గట్టాయని, ఈ రెండు పార్టీలకు ఓటేస్తే తెలంగా ణను కాటేస్తాయని తెలిపారు. మీ కోసం జీతగాడిలా పనిచేస్తా. మీ ప్రేమాభిమానాలే మీరు నాకిచ్చే కూలి అని అన్నారు. రూ.2500 కోట్లతో ఆర్మూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి శిఖరంగా మార్చానని, మీ దీవెనలతో హ్యాట్రిక్ సాధిస్తా"అని జీవన్ రెడ్డి భావోద్రేకంతో చెప్పారు. .పార్టీ కార్యకర్తల కుటుంబాలకు నూతన వస్త్రాలు... కాగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, రజిత రెడ్డి దంపతులు ఘనంగా సత్కరించారు. సమ్మేళనానికి సతీ సమేతంగా హాజరైన పార్టీ కార్యకర్తలకు, వారి సతీమణులకు ఎమ్మెల్యే దంపతులు నూతన వస్త్రాలను పెట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. సమ్మేళనం సందర్భంగా భోజనం ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించిన జీవన్ రెడ్డి దంపతులు పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు కార్యకర్తల యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇంచార్జి, శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, రాజ్య సభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, ఎమ్మెల్సీ విజి గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, టీఎస్ డబ్ల్యూ సీ డీసీ చైర్ పర్సన్ ఆకుల లలిత ,మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ మధు శేఖర్, కోటపాటి నరసింహ నాయుడు, సీనియర్ నాయకుడు రాజారామ్ యాదవ్ , పండిత్ పవన్ బి ఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పుట్టింటి లింబారెడ్డి, ఎంపి గంగారెడ్డి, దమ్మాజీ శ్రీనివాస్, అంకాపూర్, చేపూర్, మిర్దాపల్లి, సుర్బిర్యాల్, ఖానాపూర్, రాంపూర్ గ్రామాల సర్పంచులు పూజిత కిషోర్‌రెడ్డి, ఇందూరు సాయన్న, మధువర్మ, సట్లపల్లి సవిత గణేష్, సింగిరెడ్డి మోహన్, బంటు దయానంద్ పాల్గొన్నారు.



పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబీకులు